ప్రజాశక్తి
గురువారం 20 మార్చి 2025 5
శ్రీ సత్యసాయి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

# బాధ్యతగా పని చేయండి

## కలెక్టర్ టిఎస్ చేతన్

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

తహశీల్దార్లు, మండల సర్వేయర్లు వారికి అప్పగించిన పనులను బాధ్యతగా నిర్వర్తించాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సూచించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో రీ సర్వే, పిజిఆర్ఎస్, రెవెన్యూ అంశాలపై జిల్లాలోని ఆర్డీవోలు, తహశీల్దార్లు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటి నివేశ స్థలం సర్టిఫికెట్‌ను తహశీల్దార్లు మాన్యువల్‌గా ఇవ్వరాదన్నారు. తహశీల్దార్లు అందరూ మండల కేంద్రంలోనే నివాసం ఉండాలని ఆదేశించారు. రీ సర్వే కార్యక్రమం సక్రమంగా జరిగితే భూ సమస్యలు తగ్గుతాయని తెలిపారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన వినతులపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సమస్యను పరిష్కరించేలా చూడాలన్నారు. మండల సర్వేయర్లు, గ్రామ సర్వేలుహద్దుల గుర్తింపు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. భూ యజమానికి ముందుగా రీ సర్వే గురించి తెలియజేయాలని ఆదేశించారు. ఐవిఆర్ఎస్ రిపోర్టులో అమరాపురం, ఆగలి, చిలమత్తూరు, రొద్దం, రొళ్ల, సోమందపల్లి, సర్వేర్లపై వచ్చిన ఆరోపణలపై సంబంధిత ఆర్డీవోలు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నివేదికలు అందజేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మాట్లాడుతూ 20వ తేదీ నుంచి నిర్వహించే రీ సర్వేకు ముందుగా ప్రతి రైతు, పట్టదారునికి నోటీసులు జారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీవోలు సువర్ణ, మహేష్, శర్మ, ఆనంద్, సర్వే అండ్ ల్యాండ్ అధికారి విజయశాంతి భానుతో పాటు జిల్లాలోని తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నింటా అదానీ కాలుష్యం..!

తాడిపత్రి మండలం తలారి చెరువు వద్ద 400 మెగావాట్ల ఏర్పాటైన సోలార్ పార్కు

- చుట్టుపక్కల గ్రామాలపై ప్రభావం
- జెన్‌కోకు తప్పని ఇక్కట్లు
- విద్యుత్ ఉత్పత్తిపై ప్రభావం

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

అదానీ సిమెంటు పరిశ్రమ కాలుష్యం కాటుతో చుట్టుపక్కలున్న వారి జీవనం దుర్భరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ప్రభావం ప్రజల జీవనంపైనే కాకుండా జెన్‌కోకూ ఇక్కట్లను తెచ్చిపెడుతోంది. జిల్లాలోని తాడిపత్రి మండలం తలారిచెరువు వద్దనున్న పెన్నా సిమెంటు పరిశ్రమను అదానీ ఇటీవలనే టేకోవర్ చేసిన విషయం తెలిసిందే. గతంలో పెన్నా సిమెంట్ నడుస్తున్న సమయంలో దుమ్ము పెద్దగా బయటకు రాకుండా కాలుష్య నియంత్రణకు అవసరమైన చర్యలు చేపడుతూ రావడంతో అంత పెద్దగా ఇబ్బందుల్లేకుండా ఉంటూ వచ్చాయి. ఇటీవల అదానీ సంస్థ దీన్ని తీసుకున్నాక కాలుష్యం నియంత్రణ చర్యలపై పెద్దగా దృష్టి సారించలేదన్న ఆరోపణలున్నాయి. ఈ ప్రభావం చుట్టుపక్కల గ్రామాలపైనేకాకుండా అక్కడున్న జెన్‌కో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంపైనా పడుతోంది. ఇలాగైతే తమకు ఇబ్బందులు తప్పవని జెన్‌కో అధికారులు ఇప్పటికే అదానీ సంస్థకు, కాలుష్య నియంత్రణ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం.

**ఎపి జెన్‌కోపై కాలుష్యకాటు**

తాడిపత్రి మండలం తలారి చెరువు వద్ద 400 మెగావాట్ల సోలార్ పార్కు 2019లో ప్రారంభమైంది. అప్పటి నుంచి రోజుకు రెండు మిలియన్ యూనిట్ల నుంచి నాలుగు మిలియన్ యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పదాన జరుగుతూ వస్తోంది. ఇటీవల అదానీ సిమెంటు పరిశ్రమ నుంచి వస్తున్న దుమ్ము సోలార్ ప్యానళ్లపై పడుతోంది. సాధారణంగా నెలలో రెండు సార్లు ప్యానళ్లు శుభ్రం చేస్తే సరిపోయేది. అదానీ పరిశ్రమ నుంచి వస్తున్న దుమ్ముతో ఇప్పుడు ఎన్నిసార్లు శుభ్రం చేసినా ప్యానళ్లపై ఉన్న దుమ్ముపోవడం లేదని అక్కడి ఇంజినీర్లు వాపోతున్నారు. దుమ్మును తొలగించేందుకు కెమికల్ వేసినా ప్రయోజనం ఉండటం లేదని చెబుతున్నారు. ఈ విషయాన్ని సిమెంటు యాజమన్యం దృష్టికే కాకుండా కాలుష్య నియంత్రణ మండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.

**గ్రామాలపైనా ప్రభావం**

తలారి చెరువుతోపాటు, పక్కనున్న గ్రామాలపైనా కూడా ఈ దుమ్ము ప్రభావం ఇటీవల పెరిగిందని స్థానికులు చెబుతున్నారు. పెన్నా సిమెంటు యాజమాన్యం ఉన్నంత వరకు నివారణ చర్యలు కొంత ఉండేవని, ఇటీవలి కాలంలో అవేవి లేకుండా పోయిందని చెబుతున్నారు. కార్మికులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. గతంలో నీళు చల్లడం ద్వారా దుమ్ము ఎగసకుండా చర్యలుండేవని, ఇటీవలి కాలంలో అవి లేకపోవడంతో పనిచేసే కార్మికులు కూడా అ ప్రాంతంలో పని చేస్తున్న చోట ఇబ్బందులు పడుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలి**

అదానీ సిమెంటు పరిశ్రమ ద్వారా వస్తున్న కాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టాలి. లేకపోతే ప్రజలేకాకుండా పక్కనున్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రమైన జెన్‌కోకు ఇబ్బందులు తప్పవు. అధికారులు స్పందించి కాలుష్య నియంత్రణకు అవసరమైన అన్ని రకాల చర్యలను సిమెంటు యాజమాన్యం తీసుకునే విధంగా ఆదేశాలు ఇవ్వాలి.

**ఓ.నల్లప్ప,**
**సిపిఎం అనంతపురం జిల్లా కార్యదర్శి.**

# 'పది' పరీక్షలకు 99.38 శాతం హాజరు

**ప్రజాశక్తి - కొత్తచెరువు**

శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 104 పరీక్ష కేంద్రాల్లో పదవ తరగతి రెండవ రోజు హిందీ పరీక్షను నిర్వహించారు. 21,240 మందికి గాను 21,109 మంది విద్యార్థుల హాజరయ్యారని డీఈవో జి. క్రిష్టప్ప, జిల్లా వత్తి విద్యాధికారి లాజర్ తెలిపారు. ఈ మేరకు ఈ పరీక్షలకు 99.38 శాతం మంది హాజరు అయినట్లు చెప్పారు. ఇందులో ప్రైవేట్ విద్యార్థులు 31 మందికి గాను 21 మంది హాజరయ్యారన్నారు. .అపొస్ (ఇంగ్లీష్ )పదవ తరగతి పరీక్షలకు గాను సత్య సాయి జిల్లా వ్యాప్తంగా 11 కేంద్రాల్లో 547 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 448 మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేసినట్లు వివరించారు.

# రైతుల పొలాలకు దారి వదలని శ్రీ షిరిడి సాయి గ్లోబల్ ట్రస్ట్

**దారి తొలగించేందుకు వెళ్లిన అధికారులను అడ్డగించిన సిబ్బంది**
**నోటీసులు జారీ చేసిన రెవెన్యూ అధికారులు**

గేటుకు లోపల తాళం వేయడంతో బయట వేచి ఉన్న రెవెన్యూ అధికారులు, రైతులు

**ప్రజాశక్తి - పెనుకొండ**

భూములకు వెళ్లే బండి దారిని అక్రమించి రైతులు పొలాలకు వెళ్లేందుకు 15 రోజుల్లో దారి వదులుతామని అంతవరకు సమయం కావాలని చెప్పిన షిరిడి సాయి గ్లోబల్ ట్రస్ట్ సభ్యులు మాటమార్చారు. ప్రస్తుతం దారి వదిలే ప్రసక్తే లేదంటూ రెవిన్యూ అధికారులు రైతులను అడ్డుకున్నారు. ఈ సంఘటన బుధవారం పెనుకొండ మండలం రాంపురం పంచాయతీ శ్రీ షిరిడి సాయి గ్లోబల్ ట్రస్ట్ అండ్ హౌస్ వద్ద చోటుచేసుకుంది. రెవెన్యూ అధికారులు రైతులు అందించిన వివరాల మేరకు ... పెనుకొండ వాసుదేవపురం(రాంపురం) మండలం పొలంలో వెంటకరెడ్డిపల్లికి చెందిన రైతులకు భూములున్నాయి. పదిహేనేళ్ల క్రితం శ్రీసాయి కాళేశ్వర్ శ్రీషిర్డిసాయి గ్లోబల్ ట్రస్టు పేరుతో సుమారు 180ఎకరాలను రైతులతో కొనుగోలు చేశారు. అప్పట్లో ప్రయివేటు సర్వేయర్లతో సర్వేచేయించి పొలం చుట్టు కంచె వేయించారు. భూమి చుట్టుపక్కల రైతుల వెళ్లే దారిని సైతం అక్రమించి కంచెవేశారు. అప్పట్లో ఆ భూములకు విలువ లేక, నీటి వసతి లేక సాగు చేయకుండా బీడుగా వదలేశారు. అయితే కియా కార్ల పరిశ్రమ రాకతో ఈ ప్రాంతంలో భూముల ధరలు పెరిగి పోయాయి. దీంతో బీడు భూములుగా ఉన్న పొలాలను రైతులు సాగు చేసేందుకు సిద్ధం అయ్యారు. అయితే పొలాల్లోకి వెళ్లేందుకు దారి లేక ఇబ్బందులు పడ్డారు. రెవిన్యూ అధికారుల చుట్టూ తిరిగి నిరసనలు చేస్తే జనవరి నెలలో అధికారులు స్పందించి రైతుల పొలాలకు దారి చూపుతామని హామీ ఇచ్చారు. అనంతరం శ్రీ షిరిడి సాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్ పర్సన్ శిల్ప, తహశీల్దార్ శ్రీధర్ రైతులతో చర్చించారు. 15 రోజులు సమయం ఇస్తే కంచె తొలగించి రైతులకు దారి చూపుతామని, ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమి నీటి కుంటను సైతం వదిలివేస్తామని అప్పట్లో ట్రస్టు సభ్యులు చెప్పినట్లు రైతులు చెబుతున్నారు. అయితే నెలలు గడుస్తున్న శిరిడి సాయి గ్లోబల్ ట్రస్ట్ సభ్యులు పట్టించుకోకపోవటంతో రైతులు ఈ విషయాన్ని మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో షిరిడి సాయి గ్లోబల్ ట్రస్ట్ ఆక్రమణలో ఉన్న భూములను సర్వే చేసేందుకు మూడు రోజుల క్రితం రెవెన్యూ అధికారులు శ్రీ షిరిడి సాయి గ్లోబల్ ట్రస్ట్‌కు నోటీసులు జారీ చేశారు. దీంతో సర్వేను అడ్డుకునేందుకు శ్రీ షిరిడి సాయి గ్లోబల్ ట్రస్ట్ సభ్యులు లాయర్ నోటీసులను రెవెన్యూ అధికారులకు పంపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు రైతులు సర్వే చేసేందుకు బుధవారం వెళ్లిన సమయంలో శ్రీ షిరిడి సాయి గ్లోబల్ ట్రస్ట్ సభ్యులు ఫామ్ హౌస్ గేట్లకు తాళాలు వేసి వారిని లోపలకు పంపకుండా అడ్డగించారు. 'మా మేడం తో మాట్లాడుకోండి అంతవరకు మేము గేట్లు తీయం.. ఎవరు వస్తారో ఏమి చేస్తారో చూస్తామ'ంటూ ట్రస్టు సభ్యులు అధికారులతో, రైతులతో వాదనకు దిగారు. తాము రైతుల పొలాలకు దారి చూపేందుకు మాత్రమే వచ్చామని మీకు నోటీసులు అందిన తర్వాతే సర్వే చేస్తామని ఆర్ఐ భాస్కర్ రెడ్డి ట్రస్ట్ మేనేజర్‌కు ఫోన్ లో చెప్పిన వారు స్పందించలేదు. దీంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా రైతుల వెంకటేష్, గిరి, శ్రీనివాసులు, భాస్కర్, రమేష్ తదితరులు మాట్లాడుతూ ట్రస్టు భూమిని కబ్జా చేయకపోతే ఎందుకు సర్వేను అడ్డుకుంటోందని ప్రశ్నించారు. తహశీల్దార్ సమక్షంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి భూములకు దారి వదులుతామని హామీ ఇచ్చిన ట్రస్ట్ ఛైర్‌పర్సన్ కాలయాపన చేసి రైతులను మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఇలాగే కొనసాగితే నిరసన కార్యక్రమాలు చేపట్టి సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని వారు హెచ్చరించారు.

# ప్రజా సమస్యలపై 25న చలో కలెక్టరేట్

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్**

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్

**ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్**

ఎన్నికల హామీల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 25న సిపిఎం ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్‌ను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ తెలియజేశారు. పుట్టపర్తిలోని కార్మిక కర్షక భవనంలో బుధవారం నాడు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈఎస్.వెంకటేష్ అధ్యక్షత జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం రాంభూపాల్ విలేకరులతో మాట్లాడుతూ సత్యసాయి జిల్లాలో ఆగిన జగనన్న, టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు వెంటనే అప్పగించాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన విధంగా పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లను పేదలకు వెంటనే ఇవ్వాలన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో శ్మశానవాటికకు ప్రత్యేక భూమిని కేటాయించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా ఉద్యోగ కార్మికులపై రాజకీయ వేధింపులు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. ఉపాధి కూలీలకు పది వారాల కూలి బకాయిలు ఉన్నాయని చెప్పారు. హంద్రీనీవా లైనింగ్ పనులతో రైతులకు నష్టం వాటిల్లుతుందని చెబుతున్నా ప్రభుత్వం మొండిగా ఆ పనులు చేసేందుకు ముందుకు వెళ్తోందన్నారు. లైనింగ్ పనులను ఆపి హంద్రీనీవా కాలువ వెడల్పు చేపట్టాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. సర్దుబాటు పేరుతో ప్రజలపై వేస్తున్న విద్యుత్ ఛార్జీల భారాన్ని రద్దు చేయాలన్నారు. ఈ సమస్యలన్నింటిపై ఈనెల 25న జరిగే చలో కలెక్టరేట్ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జెడ్‌పి.శ్రీనివాసులు, జివిఎల్.నరసింహులు, జంగాలపల్లి పెద్దన్న, దిల్షాద్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజా ఫిర్యాదులను స్వీకరిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్

**ప్రజాశక్తి-హిందూపురం**

ప్రజలు వారు ఎదుర్కొనే వివిధ సమస్యలపై ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించి ప్రాధాన్యత రూపంలో పరిష్కరిస్తామని మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ నివాసం వద్ద మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా పురపాలక సంఘ వ్యాప్తంగా వివిధ వార్డుల్లో ప్రజలు వారు ఎదుర్కొంటున్న సమస్యలను అర్జీల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ మాట్లాడుతూవచ్చిన ఫిర్యాదులన్నింటినీ పరిశీలన చేసి ప్రాధాన్యత రూపంలో ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు, మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ శోభన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులతో పాటు పలువురు కౌన్సిలర్లు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# సబ్‌జైలు తనిఖీ

**ప్రజాశక్తి - కదిరి టౌన్**

స్థానిక సబ్ జైలును జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి శివ ప్రసాద్ యాదవ్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో న్యాయమూర్తి మాట్లాడారు. ఖైదీలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నరసింహులు, రఘునాథ్, ప్రభాకర్, నరేష్ కుమార్ రెడ్డి, జైలు సూపరింటెండెంట్ వాసుదేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రథోత్సవానికి తెడ్లు అందజేత

**ప్రజాశక్తి - కదిరి అర్బన్**

ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం జరగనున్న రథోత్సవం సందర్భంగా రథం నియంత్రణకు ఉపయోగించే తెడ్లు (చిన్నమొద్దులు) కదిరి మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుల్లో నివాసము ఉన్న అటవీశాఖ లో విధులు నిర్వహిస్తున్న హరిప్రసాద్ అందజేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఉదయము అర్చకులు సునీల్ నాగభూషణ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆనవాయితీగా ప్రతి ఏడాది రథోత్సవానికి తెడ్లను అందిస్తున్నట్లు హరిప్రసాద్ కుటుంబ సభ్యులు తెలిపారు.

# విద్యార్థులకు పెన్నులు అందజేత

**ప్రజాశక్తి - నల్లచెరువు**

మండల కేంద్రంలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న 300 మంది విద్యార్థులకు గోపన్న రాంప్రసాద్ పెన్నులు అందజేశారు. ఎంఇఒ తిరుపాల్‌నాయక్ చేతులమీదుగా వీటిని అందజేశారు.

# మహిళా చట్టాల పై అవగాహన

**ప్రజాశక్తి - రొద్దం**

మండలంలోని చోళేమర్రి గ్రామంలో బుధవారం అనంత శక్తి సొసైటీ ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో లావణ్య, అధ్యక్షురాలు సుశీలమ్మ మాట్లాడుతూ మహిళ చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం సమాజంలో మహిళలపై వివక్షత, హింసపై, నాటిక రూపంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రామలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

# భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

**ప్రజాశక్తి - చిలమత్తూరు**

ప్రభుత్వం పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములు, ఏపీఐఐసీ లేపాక్షి నాలెడ్జ్ హబ్ వంక పోరంబోకు భూముల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం హిందూపురం శాసన సభ్యులు నందమూరి బాలక్రిష్ణ వ్యక్తిగత కార్యదర్శి శ్రీనివాసరావుకు పలు సమస్యలతో కూడిన మండల స్థాయి గ్రీవెన్స్‌లో వినతి పత్రాన్ని సమర్పించారు. మండల కేంద్రంలో మండల అభివద్ధి కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ అధ్యక్షతన గ్రీవెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐపెం జిల్లా కమిటీ సభ్యులు ఫిరంగి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మండలంలో కోడూరు గ్రామ పంచాయతీ మొర్రం పల్లి దగ్గర చిత్రావతి నది పై వంతెన నిర్మించి, ప్రభుత్వ భూములను అక్రమించుకొని పొరంపాండ్లను ఏర్పాటు చేసుకున్నారన్నారు. నాలుగు నెలల క్రితం రెవిన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలు వేంటనే పున్ణ పరశీలన చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతుల దగ్గర నుంచి ఒక్కొక్క ఫైల్ కి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపణ వస్తున్నాయని వెంటనే విచారణ చేయాలని డిమాండ్ చేశారు. వేసవి కాలంలో మండలంలో నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు మంజూరు చేసి, ఉపాధి కూలీలకు పని ముట్లు ఇవ్వాలని కోరారు. మండలం లోని కోడూరు గ్రామానికి వెంటనే రోడ్డు మరమత్తులు చేయాలని డిమాండ్ చేశారు.

**రెడ్డప్పశెట్టి ఆక్రమణ చేసిన భూమిని స్వాధీనం చేసుకోవాలి**

రెడ్డప్పశెట్టి ఆక్రమించిన చిత్రావతి మిగులు భూములు, ప్రభుత్వ భూములు, నది పరివాహక భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని టీడీపీ ఎస్సి సెల్ డైరెక్టర్ బేకరీ గంగాధర్ అధికారులను డిమాండ్ చేశారు. అగ్రికల్చర్ భూమిలో రోడ్డు ఎలా వేశారని అధికారులకు ప్రశ్నించారు. రెడ్డప్పశెట్టి సాగులో ఉన్నట్లు ఎలా నివేదిక పంపారని ఆగ్రహం వ్యక్తం చేవారు. రెడ్డప్ప శెట్టి కి అనుకూలంగా అధికారులు నివేదిక పంపారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ జగన్నాథ్, ఎంపీడీవో రమణమూర్తి, సిపిఎం నాయకులు వెంకటేష్, రామచంద్ర, సదాశివరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ రంగారెడ్డి, అశ్వర్థప్ప తదితరులు పాల్గొన్నారు.

# గజవాహనంపై నారసింహుడు

**ప్రజాశక్తి - కదిరి అర్బన్**

లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీవారు గజవాహనంపై విహరించారు. ఈ వాహనం తరువాత రోజు బ్రహ్మరథోత్సవం జరగనుంది. శ్రీవారి ఆలయం ఇప్పటికే భక్తులతో కిటకిటలాడుతోంది. ఈ వాహనోత్సవాన్ని కదిరి ప్రాంతంలో తెల్లటేనుగు మెరువవ అని పిలుస్తుంటారు. ప్రస్తుతం గజవాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. వాహనసేవ ముందు భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఉత్సవం కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. గజ వాహనం రోజు తిరువీధులలో భక్తాదుల సౌకర్యం కొరకు ఎక్కడ చూసినా అన్నదాన కేంద్రాలు ఏర్పాటు చేశారు. వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం బ్రహ్మ రథోత్సం నిర్వహించనున్నారు. అందుకు అధికారులు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

గజవాహనంపై శ్రీవారు

## దళితసంఘాల హర్షం

**ప్రజాశక్తి -పావగడ**

తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు మంగళవారం మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలిపి సిఫారసు చేసినందుకు కర్ణాటక రాష్ట్రంలోని పావగడ తాలూకాలో దళిత సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు స్థానికఅంబేద్కర్ విగ్రహం వద్ద తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మందకృష్ణమాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా దళిత సంఘం నాయకుడు టి ఎన్ పేట రమేష్ మాట్లాడుతూ తెలంగాణ మాదిరే గానే కర్నాటకలో కూడా ఎస్సీ వర్గీకరణకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నిర్ణయం తీసుకొని జనాభా కనుగుణంగా వర్గీకరణ తీర్పును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో దళిత నాయకులు కోర్టు నరసప్ప, వల్లూరు నాగేష్ రామాంజనప్ప, మంగళవాడ హనుమంతరాయ, రామకృష్ణ, మంజునాథ్, నరసింహతో పాటు పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

## నామినేటెడ్ సభ్యుడిగా నాగరాజు

**ప్రజాశక్తి - పావగడ**

పావగడకు చెందిన కె.టి నాగరాజును తుమకూరు జిల్లా డాక్టర్. బాబు జగ్జీవన్ రామ్ లెదర్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ నామినేటెడ్ సభ్యుడిగా నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు నాయకులు తెలిపారు. ఈసందర్భంగా నాగరాజు కాంగ్రెస్ నాయకులు, మాజీమంత్రి వెంకటరమణప్పను కలిసి పూలమాలతో సత్కరించారు.

## 21న ఉచిత కంటి వైద్య శిబిరం

**ప్రజాశక్తి - నంబులపూలకుంట**

మండల కేంద్రంలోని శివాలయం వద్ద ఈనెల 21నఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ అమర్నాథ్ తెలిపారు.ఉచిత కంటి వైద్య శిబిరానికి వచ్చేవారు ఆరోగ్యశ్రీ కార్డు ఆధార్ కార్డు తీసుకుని రావాలన్నారు.

## అన్నదాన కార్యక్రమం

**ప్రజాశక్తి - మడకశిర**

రొల్ల మండల కేంద్రంలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల కార్యక్రమాలలో భాగంగా భూతప్ప ఉత్సవాల సందర్భంగా ప్రతి ఏటా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈసారి కూడా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విపి నవీన్ కుమార్, జికే ఈరన్న, దాసిరెడ్డి, రామకష్ణ, రవికుమార్, భరత్, ఆనంద్, బ్యాడిగిరా మూర్తి, కష్ణమూర్తి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## 22న మండల మీట్

**ప్రజాశక్తి - గాండ్లపెంట**

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 22న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ వెంకటరామిరెడ్డి తెలిపారు. ఎంపీపీ బి గంగోజమ్మ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్పిటిసితో పాటు సభ్యులు ఆయా శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

## పది పరీక్ష కేంద్రం తనిఖీ

**ప్రజాశక్తి - నంబులపూలకుంట**

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన 10వ తరగతి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ అధికారి చిన్నకృష్ణ పరిశీలించారు. విద్యార్థులకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని డిపార్ట్‌మెంట్ అధికారి రియాజ్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో తనిఖీ అధికారి సుబ్బయ్య నాయక్, డిప్యూటీ తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ నిర్మాణానికి విరాళం

**ప్రజాశక్తి - లేపాక్షి**

మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం ఆవరణంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ దుర్గా దేవి ప్రెస్ క్లబ్ నిర్మాణానికి లేపాక్షి మండల విద్యుత్ శాఖ విరాళం అందించింది. విద్యుత్ శాఖ ఇంజనీర్ వెంకటేశులు, సిబ్బంది కలసి 20 వేల రూపాయలను కమిటీ సభ్యులకు అందజేశారు. అదే విధంగా చోళ సముద్రం జడ్పీ హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ పాఠశాల ఉపాధ్యాయులు 10వేల రూపాయలు విరాళం అందజేశారు.

## ఆక్రమణల తొలగింపు

**ప్రజాశక్తి - ముదిగుబ్బ**

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) స్థలంలో జరుగుతున్న ఆక్రమణలను అధికారులు బుధవారం జేసీబీ సాయంతో తొలగించారు. ముదిగుబ్బ పీఏసీఎస్ స్పెషల్ ఆఫీసర్, సబ్ డివిజనల్ అధికారి వన్నూరుస్వామి, ముదిగుబ్బ సీఈవో శ్రీనివాసులు, పంచాయతీ సెక్రెటరీ మంజులాదేవి, టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జి తుమ్మల మనోహర్ తదితరులు ఆక్రమణలను పరిశీలించి తొలగింపజేశారు. ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు ఈసందర్భంగా హెచ్చరించారు.

## డ్రెయినేజీ పనుల పరిశీలన

**ప్రజాశక్తి - కదిరి టౌన్**

కదిరి రూరల్ మండలం కదిరికుంట్లపల్లిలోని సోమేష్ నగర్‌లో చేపట్టిన డ్రయినేజీ పనులను ఎంపీడీవో పోలప్ప బుధవారం పరిశీలించారు. కాలనీలో నెలకొన్న డ్రయినేజీ సమస్యను గ్రామస్తులు ఇటీవల స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన పనుల నిర్వహణకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో పంచాయతీ నిధులు 8 లక్షల రూపాయలతో సర్పంచి రజినీష్ రెడ్డి ఆధ్వర్యంలో డ్రయినేజీ పనులు చేపట్టారు. ఈ పనులను కదిరి ఎంపీడీవో పోలప్ప పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్, పిఆర్ జెఇ గుప్తా , ఇంజనీరింగ్ అసిస్టెంట్ పృథ్వీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బ్రాంచ్ కెనాల్ ద్వారా చెరువులను నింపాలి

నిరుపయోగంగా ఉన్న పంప్‌హౌస్‌ను చూపిస్తున్న నాయకులు

**ప్రజాశక్తి - మడకశిర**

గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచి కెనాల్ ద్వారా నియోజకవర్గంలోని చెరువులన్నింటినీ నీటితో నింపాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హరి, జిల్లా కమిటీ నాయకులు సోమకుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు నిరుపయోగంగా ఉన్న గొల్లపల్లి పంప్ హౌస్‌ను బుధవారం పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర కు బ్రాంచి కెనాల్ ఏర్పాటు చేసి, సాగు, తాగు నీరు కోసం చెరువులకు నీటిని సరఫరా చేస్తామని, అప్పటి టిడిపి ప్రభుత్వం, ఆ తరువాత వచ్చిన వైసిపి ప్రభుత్వం చెప్పాయన్నారు. ఇప్పటి వరకు అరకొరగా రెండు సార్లు మాత్రమే బ్రాంచి కెనాల్‌కు నీటిని వదిలారన్నారు. కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయలు రుణ మాఫీ చేసే ప్రభుత్వాలు , రైతులకు ఉపయోగపడే, వందల కోట్లు ఖర్చు తో పూర్తి ఆయ్యే మడకశిర బ్రాంచి కెనాల్ పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. రైతులను, పాడిపరిశ్రమను ఆదుకోవాలని నిరూపయోగంగా వున్న పుంప్‌హౌస్‌లను ఉపయోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో, వేమారెడ్డి , రంగనాథ్ పాల్గొన్నారు.

# వేలం రద్దుపై అనుమానాలు

వేలం పాటను నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం పురపాలక సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వేలం పాటలో కొన్నింటికి నిర్వహించాల్సిన వేలాలను రద్దు చేయడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దినసరి కూరగాయల మార్కెట్, రోడ్డు మార్జిన్ లపై విక్రయాలు చేస్తున్న వారిపై సుంకం వసూలు తీసుకోవడానికి, అదేవిధంగా చిన్న పశువులు వాటి తోళ్ల మార్కెట్, పెద్ద పశువులు వాటి తోళ్ల మార్కెట్, పరిగి బస్టాండు ఆవరణంలోని ఖాళీ స్థలములలో వాహనాలకు ఫీజు వసూలుకు సంబంధించి మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఇందులో తొలత పరిగి బస్టాండ్ ఆవరణంలోని ఖాళీ స్థలమునకు బహిరంగ వేలాన్ని అధికారులు రూ. 19.22 లక్షల సర్కారీ వారి పాటతో వేలం ప్రారంభించారు. దీనిని అన్వర్ రూ. 21.75 లక్షలకు దక్కించుకున్నారు. అయితే 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇదే స్థలం రూ. 21.10 లక్షలకు పోయింది. అనంతరం చిన్న పశువులు వాటి తోళ్ల మార్కెట్ బహిరంగ వేలం నిర్వహించగా రూ 7.30 లక్షలకు మాయే జబీన్ పాటను దక్కించుకున్నారు. అనంతరం పురపాలక సంఘ దినసరి కూరగాయల మార్కెట్, రోడ్డు మార్జిన్ లపై అమ్ముకునే వస్తువులపై సుంకం వసూలు చేయడానికి కోసం బహిరంగ వేలం నిర్వహించారు. అధికారులు మూడు సంవత్సరాల సరాసరిని లెక్కించి రూ. 42.18 లక్షలతో పాటను ప్రారంభించారు. దీనికోసం గుత్తేదారులు పోటీపడి మరి వేలంలో పాల్గొన్నారు. తొలుత అల్తాఫ్ అనే గుత్తేదారుడు రూ 4.30 లక్షలతో పాట ప్రారంభించగా రూ. 64.25 లక్షల వరకు గుత్తేదారులు పోటీపడ్డారు. అయితే మున్సిపల్ కమిషనర్ అనుకున్న దానికన్నా గుత్తేదారులు అధికంగా పాడుతున్నారని గ్రహించి వేలంపాటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించి వెళ్లిపోయారు. అప్పటికే పరిగి బస్టాండ్ ఆవరణంలోని ఖాళీ స్థలం, చిన్న పశువులు వాటి తోళ్ల మార్కెట్ కు సంబంధించి వేలం నిర్వహించిన వాటిని ఖరారు చేసి, పురపాలక సంఘం దినసరి కూరగాయల మార్కెట్, పెద్ద పశువులు వాటి తోళ్ల మార్కెట్ కు సంబంధించి వేలంపాటలను రద్దు చేస్తున్నట్లు రెవిన్యూ అధికారిణి విజయభారతి పేర్కొన్నారు. అయితే పురపాలక సంఘానికి దినసరి కూరగాయల మార్కెట్ నుంచి వచ్చే ఆర్థిక సంవత్సరానికి మున్సిపల్ అధికారులు నిర్ణయించిన దానికన్నా రూ. 22 లక్షలకు పైగా ఆదాయం వస్తున్నప్పటికీ బహిరంగ వేలం నిర్వహించకుండా వాయిదా వేయడంలో ఆంతర్యం ఏమిటన్నది అర్థం కావడం లేదు. వేలంపాట ఇదేవిధంగా కొనసాగి ఉంటే దాదాపు దినసరి కూరగాయల మార్కెట్ రూ. 80 లక్షల వరకు గుత్తేదారులు పాడేవారు. గత ఆర్థిక సంవత్సరం రూ. 42 లక్షలకు అధికారికంగా దక్కించుకున్న గుత్తేదారుడు అనధికారికంగా రూ. 75 లక్షలకు ఇతరులకు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఆదాయాన్ని పెంచాల్సిన అధికారులు ఆదాయం వస్తుందని తెలిసినప్పటికీ అర్థాంతరంగా బహిరంగ వేలం పాట రద్దు చేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని దినసరి కూరగాయల మార్కెట్ బహిరంగ వేలంను పకడ్బందీగా నిర్వహిస్తే పురపాలికకు భారీగా ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీనిపై జిల్లా కలెక్టర్ ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ బహిరంగ వేలంలో మున్సిపల్ కమిషనర్ తో పాటు మేనేజర్ సుధాకర్, రెవిన్యూ అధికారిణి విజయభారతి, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ రాము, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నులిపురుగుల నిర్మూలనతోనే పిల్లల్లో ఎదుగుదల

**ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్**

నులిపురుగుల నిర్మూలన తోనే పిల్లల్లో ఎదుగుదల ఉంటుందని జిల్లా ఎన్‌సిడి, ఆర్‌బిఎస్‌కె పోగ్రాం అధికారి డాక్టర్ నివేదిత తెలిపారు. బుధవారం ఎనుములపల్లిలో గల అంగన్వాడీ కేంద్రంతో పాటు పాఠశాల, ప్రశాంతి గ్రామ్ లోని ప్రైవేటు పాఠశాల, కేజీబీవీ, మంగళకర జూనియర్ కళాశాలను ఆమె సందర్శించారు. గత నెల 10, 17 తేదీలలో నులిపురుగుల నివారణ మాత్రలు మింగిన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఆరోగ్యానికి, రక్తహీనత, పోషకాహారం లోపం, మానసిక ఎదుగుదల లోపాలు నులిపురుగుల నివారణతో సాధ్యమని డాక్టర్ చెప్పారు. వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.. ఈ కార్యక్రమంలో డాక్టర్ జోష్న, డాక్టర్ ముని చంద్రిక, సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, సూపర్‌వైజర్ చంద్రకళ, అపర్ణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## సిజేరియన్ ప్రసవాలు తగ్గించడమే ధ్యేయం

**ప్రజాశక్తి-హిందూపురం**

సిజేరియన్ ప్రసవాలు తగ్గించడమే ప్రభుత్వ ధ్యేయం అని, దానికి అనుగుణంగా ప్రవేటు అసుపత్రి, నర్సింగ్ వైద్యులు సాధారణ కాన్పులను ప్రోత్సహించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం పట్టణంలోని శ్రీసుధ, బాలాజీ, వి ఎస్ ఆర్ మల్టీ స్పెషలిటీ హాస్పిటల్స్, సిద్ధార్థ ఆర్థో అండ్ చిల్డ్రన్స్ క్లినిక్ తో పాటు ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసూతిపై ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడిట్ సిబ్బంది ఆయా అసుపత్రుల్లో పిసి పిఎన్ డిటి, స్కాన్ రిపోర్టులతో పాటు వివిధ రిపోర్టులతో పాటు అన్ని వివరాలను పరిశీలించారు. అనంతరం డాక్టర్ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులనందు ఎక్కువ శాతం సాధారణ ప్రసవాలే జరిగే విధంగా వైద్యులు చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రయివేటు స్పత్రుల నిర్వాహకులతోపాటు ఆడిట్ టీమ్ ఎస్ఒ కళాధర్, డిహెచ్ఇ రామలక్ష్మి పాల్గొన్నారు.

## ముస్లిం కుటుంబాలకు కూరగాయలు పంపిణీ

**ప్రజాశక్తి-హిందూపురం**

రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం కుటుంబాలకు అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ సొంత నిధులతో లోక్ అదాలత్ ఆధ్వర్యంలో కూరగాయలను బుధవారం పంపిణీ చేశారు. 60 కుటుంబాలకు వివిధ రకాల కూరగాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ న్యాయవాది సుదర్శన్, సీనియర్ న్యాయవాదులు కళావతి, సంతోషికుమారి, మురళి, లోక్ అదాలత్ సిబ్బంది శారద, శివ, వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి జ్ఞానజ్యోతి శిక్షణ

**ప్రజాశక్తి - బత్తలపల్లి**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ కార్యకర్తలకు అందిస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం రెండో విడత గురువారం నుంచి మూడు రోజులపాటు జరుగుతుందని సిడిపిఓ సరస్వతి తెలిపారు. ఈ మేరకు ఆమె బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్తలకు 120 రోజుల జ్ఞాన జ్యోతి శిక్షణలో భాగంగా ఫిబ్రవరి నెలలో ఆరు రోజులు పాటు మొదటి విడత శిక్షణ ముగిసిందన్నారు. రెండో విడత శిక్షణ కార్యక్రమం గురువారం నుంచి మూడు రోజులపాటు జరుగుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం స్థానిక ప్రాథమిక పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

## బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నాగేశ్వరరావు

**ప్రజాశక్తి-హిందూపురం**

ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఉపాధ్యక్షుడిగా హిందూపురానికి చెందిన కొటిపి నాగేశ్వరరావు నియమితులయ్యారు. అనంతపురం జిల్లా కసాపురంలో మార్చి 16న రాష్ట్రస్థాయి సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2025 - 27 సంవత్సరానికి గాను రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా నాగేశ్వరరావును నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు సతీష్ శర్మ, ప్రధాన కార్యదర్శి మనోహర్ రావు నుంచి ఉత్తర్వులు నాగేశ్వరరావుకు బుధవారం అందాయి.

## ప్రజల ప్రాణాలతో చెలగాటం తగదు

**ప్రజాశక్తి - చిలమత్తూరు**

అనేక మంది వికలాంగులకు శిక్షణ ఇస్తూ వారికి ఉపాది అవకాశాలు అందిస్తూ జిల్లాలోనే మంచిపేరు తెచ్చుకున్న సమర్థనం దివ్యాంగుల సంస్థ కొందరి మూలంగా చెడ్డపేరు తెచ్చుకుంటోందని ప్రభుత్వ వైద్యులు రామక్రిష్ణ అన్నారు. ఈ మేరకు ఆ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే పిజియోథెరపీ క్యాంప్ వాహనంలో అర్హత లేని వ్యక్తిని పిజియోథెరపిస్టుగా చెలామణి చేస్తూ సంస్థ విధులను దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. వెంటనే అర్హత లేని వ్యక్తి తొలిగించాలని అన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే క్యాంప్ వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు నిర్వాహకులపై క్రిమినల్ కేసులు పెట్టాల్సివస్తుందని హెచ్చరించారు. ప్రజల ఫిర్యాదు మేరకు అకస్మికంగా తనిఖీ చేయడంతో ఈ విషయాలు బయటపడ్డాయని ఆయన చెప్పారు.

## 25న కలెక్టరేట్ ఎదుట ధర్నా

**ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్**

ప్రజా సమస్యలపై ఈనెల 25న జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాలో అన్ని వర్గాల ప్రజలు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని మండల సిఐటియు నాయకులు పైపల్లి గంగాధర్, పెదపల్లి బాబా తెలిపారు. ఈ మేరకు వారు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిఐటియు అనుబంధ సంఘాలు, పుడా, ఇంజనీరింగ్, మున్సిపల్, శ్రీ సత్య సాయి తాగునీటి సరఫరా కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, తోపుడు బండ్లు, సఫాయి కార్మిక సంఘం, హమాలీ సంఘం, నాయి బ్రాహ్మణ సంఘం, ఇంటి పట్టాలు, గృహ నిర్మాణ సమస్యలు ఉన్న లబ్ధిదారులు తదితర సమస్యలు ఉన్న వారందరూ ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడమే ప్రధాన ఉద్దేశంగా ఈ ధర్నా కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు.

# నేడు ఖాద్రీశుడి రథోత్సవం

రథోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

**ప్రజాశక్తి - కదిరి టౌన్**

ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం బ్రహ్మరథోత్సవం నిర్వహించనున్నారు. రథోత్సవానికి సంబంధించి అన్ని ఏర్పాట్లను ఆలయ అధికారులు సిద్ధం చేశారు. శ్రీవారి రథోత్సవం తేరును వివిధ పుష్పాలుతో పాటు తోరణాలతో అలంకరించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు రాష్ట్రంలోని నలుమూలల నుండి కాక కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుండి భారీగా తరలివచ్చారు. రథోత్సవం సజావుగా సాగేందుకు అన్ని శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. రథోత్సవం తిరిగే తిరు మాడవీధులను కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తో పాటు జిల్లా ఎస్పీ రత్న పరిశీలించారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తుల సౌకర్యార్థం పలువురు దాతలు వివిధ చోట్ల అన్నదాన కేంద్రాలు, తాగునీటి కేంద్రాలు ఏర్పాటు చేశారు. పలువురు స్వచ్ఛందంగా వివిధ పౌరాణిక నాట్యాలు, శాసనల చిన్నమ్మ కథ, హరికథలు ఏర్పాటు చేశారు.

**బందోబస్తు ఏర్పాట్లు పరిశీలన :** శ్రీ ఖాద్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించే రథోత్సవం నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ రత్న బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సుమారు 700 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట పోలీస్

### బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏడుగురు డీఎస్పీలు, 20 మంది సిఐలు , 40 మంది ఎస్ఐలు , 500 మంది సివిల్ పోలీస్ సిబ్బంది, 100 మంది స్పెషల్ పార్టీ, ఆర్మ్డ్ రిజర్వ్‌డ్ పార్టీ, 90 మంది ఎపిఎస్‌పి పార్టీలతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

రథోత్సవం దృష్ట్యా కదిరి లో ఎక్కడా దొంగతనాలు జరుగకుండా శ్రీసత్య సాయి జిల్లా బార్డర్ జిల్లా అన్నమయ్య, అనంతపురం,కడప, తిరుపతి,కర్నూల్, నంద్యాల జిల్లాలకు చెందిన క్రైమ్ పార్టీ సిబ్బంది సుమారు 60 మంది మఫ్టీ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.కదిరిలో రద్దీ గా ఉన్న అన్ని ప్రాంతాలలో సుమారు 10 డ్రోన్ కెమెరాలు, అత్యాధునిక ప్రత్యేక 50 సిసి కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా పోలీస్, రెవిన్యూ, మునిసిపాలిటి, ఎలక్ట్రికల్ తదితర శాఖలతో ప్రత్యేక కంట్రోల్ ఏర్పాటు చేశ్యామన్నారు. మహిళలకు, చిన్న పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా 100 మంది మహిళా పోలీస్ సిబ్బందితో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.

## నేరాలు ఘోరాలు

### యువకుడు దారుణ హత్య

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం రూరల్ మండలం మలగూరు చెరువు కట్ట కింద ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన బుధవారం వెలుగు చూసింది. హత్యకు గురైన వ్యక్తి పట్టణంలోని కోట ప్రాంతానికి చెందిన సద్దాం (25) గా తేలింది. సద్దాంను మంగళవారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనంలో తీసుకువెళ్లి కొడవలితో అతి దారుణంగా నరికి చంపినట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. ఈ హత్యకు వివాహేతర సంబంధమే కారణమని పోలీసులు భావిస్తున్నారు. అనుమానంతో పట్టణంలోని శాంతి నగర్ కు చెందిన ఓ వ్యక్తినిపోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సంఘటనపై అప్ గ్రేడ్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**ప్రజాశక్తి - ధర్మవరం రూరల్**

మండలంలోని దర్శినమల గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. ధర్మవరం మండలం మాల గుండ్లపల్లి గ్రామానికి చెందిన నాగరాజు, నడిమి గడ్డ పల్లి తండాకు చెందిన గోపాల్ నాయక్ బుధవారం ద్విచక్ర వాహనములో మాల గుండ్లపల్లి నుండి ధర్మవరం వస్తూ ఉండగా దర్శనమల గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగరాజు తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. గోపాల్‌నాయక్‌కు స్వల్పగాయాలు అయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నాగరాజును మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

### మరో ప్రమాదంలో వ్యక్తికి...

**ప్రజాశక్తి-హిందూపురం**

పట్టణంలోని రైల్వే రోడ్డులో ఇంపాల స్వీట్ స్టాల్ ఎదురుగా ప్రధాన రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. గుర్తు తెలియని వాహనం ఢీ కొనగడంతో గాయపడ్డ వ్యక్తిని స్థానికులు ప్రభుత్వ అసుపత్రికి తరలించారు.

## ఆర్టీసీ ఖాళీ స్థలాలకు టెండర్లు ఆహ్వానం

**ప్రజాశక్తి - ధర్మవరం టౌన్**

పట్టణంలోని ధర్మవరం ఆర్టీసీ డిపోలో ఖాళీ స్థలములకు టెండర్లను ఆసక్తిగల వ్యాపారస్తుల నుండి కోరుతున్నట్లు డిపో మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. ప్రతి షాపును 5 సంవత్సరాల గడువుతో వ్యాపార నిర్వహణకు అనుమతి ఉందని తెలిపారు. ఆర్టీసీ బస్టాండులో ఐదు ఖాళీ స్థలాలకు బేకరీ స్వీట్ షాప్, టీ, కాఫీ బిస్కెట్ షాప్, జిమ్ సెంటర్ లాంటి వ్యాపారాలను నడుపుకోవచ్చునని తెలిపారు. ఆసక్తి కలవారు ఈనెల 26వ తేదీ లోపు రూ.885 లు చెల్లించి టెండర్ ఫారం ను పొందవచ్చునని తెలిపారు. పూరించిన టెండర్ ఫారం ను ఈనెల 27వ తేదీ గురువారం మధ్యాహ్నం 2 గంటల లోపు జిల్లా ప్రజా రవాణా అధికారి వారి కార్యాలయం పుట్టపర్తిలోని టెండర్ బాక్స్‌లో వేయాలని చెప్పారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 9959 225859 కు గాని, 6303151302 కు గాని, 73828605012 గాని సంప్రదించాలని సూచించారు.

## మండల విలేకరుల కమిటీ ఏర్పాటు

**ప్రజాశక్తి - నల్లచెరువు**

నల్లచెరువు మండల విలేకరుల కమిటీని ఎన్నుకున్నారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా భూలోకం లక్ష్మీపతి, ఉపాధ్యక్షులుగా శివశంకర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా కె.శ్రీనివాసులుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

## జన చైతన్య సమాఖ్య మండల లీడర్ల సమావేశం

**ప్రజాశక్తి - రొద్దం**

మండల కేంద్రంలోని అనంత శక్తి సొసైటీ కార్యాలయంలో రొద్దం, సికేపల్లి, రామగిరి, మండలాలకు చెందిన జన చైతన్య సమాఖ్య ఉమ్మడి మండల లీడర్ల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా టింబెక్టివ్ కలెక్టివ్ సంస్థ వ్యవస్థాపకులు బబ్లు గంగోలి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి యాజమాన్య పద్ధతులు, నీటి వాడకం విధానం, నీటి వనరులు నిర్వహణ గురించి వివరించారు. రాయలసీమ వాటర్ ప్రాజెక్ట్ మేనేజర్ పేరూరు శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రాజెక్టు గురించి వివరించారు. రాయలసీమ వాటర్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రవి మాట్లాడుతూ 2024- 25 కార్యక్రమం వార్షిక నివేదికను తెలియజేశారు. 2025 - 26 సంవత్సరం ప్రాజెక్టు పనులు ప్రణాళికను తయారు చేశారు. టింబక్టు కలెక్టివ్ అసిస్టెంట్ డైరెక్టర్ సుకన్య మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పురుషులతో మహిళలు సమానంగా ఆర్థికంగానూ, ఉమ్మడి వనరుల యాజమాన్యంలో ముఖ్య పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలల సంఘాలు చెక్కల భజనతో అలరించారు. ఈ కార్యక్రమంలో వాటర్ ప్రాజెక్ట్ ఫార్మింగ్ కోఆర్డినేటర్ సన్నప్పయ్య, గ్రామ సిరి సొసైటీ సీఈవో తిరుమల దేవి, కల్పవల్లి సొసైటీ సీఈవో చిరంజీవి, అనంత శక్తి సొసైటీ సీఈవో లావణ్య, కల్చరల్ కోఆర్డినేటర్ ఉక్కడం రవి,మొగ్గ కోర్డినేటర్ రామన్న, ఎంఐఎస్ వెంకటేష్, ఇంజనీర్ ప్రవీణ్, సొసైటీ ప్రెసిడెంట్, కార్యకర్తలు, సీఆర్పీలు, జన చైతన్య సమైక్య లీడర్లు పాల్గొన్నారు.

## కేజీబీవీలో ప్రవేశాలకు నోటిఫికేషన్

**ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్**

రాష్ట్రంలోని 352 కేజీబీవీ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 6, 11 తరగతులు, 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్లు భర్తీ కోసం బాలికల నుంచి ఆన్ లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు సమగ్ర శిక్ష సంచాలకులు శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్ దరఖాస్తులు మార్చి 22 నుంచి ఏప్రిల్ 11 వరకు చేసుకోవచ్చున్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, బడి మానేసిన వారు, పేద ఎస్సి, ఎస్టి, బీసీ, మైనార్టీ వర్గాల బాలికలతో పాటు దారిద్రరేఖకు దిగువనున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందజేయడం జరుగుతుందన్నారు. లేదా సంబంధిత పాఠశాల నోటిఫికేషన్ బోర్డులో చూడవచ్చన్నారు.

## రస్తా సమస్యను పరిష్కరించండి : సిపిఎం

**ప్రజాశక్తి - ముదిగుబ్బ**

మండల కేంద్రంలోని అక్సా మజీద్ రస్తా సమస్యను పరిష్కరించాలని సిపిఎం నాయకులు కోరారు. ముఖ ద్వారం వద్ద ఒక మనిషి కూడ వెళ్లలేని విధంగా రస్తా కబ్జాకు గురైందనిసంబంధిత పంచాయతీ అధికారులు ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. రంజాన్ మాసం సందర్భంగా నమాజ్ కు వచ్చే భక్తులకు తీవ్ర ఇబ్బందికరంగా ఉందని అన్నారు. ఈవిషయంపై గ్రామ సర్పంచి, పంచాయతీ అధికారులు స్పందించాలని సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేష్, రైతు సంఘం అధ్యక్షుడు పోతులయ్య, మునాఫ్, ఆవాజ్ కమిటీ కార్యదర్శి బాబ్జాన్, మస్జిద్ ముత్వల్లి ఫక్రుద్దీన్,అల్లాబకష్ , టైలర్ ముత్తు, తదితరులు కోరారు.

## జగన్‌ను కలిసిన వైసీపీ నాయకులు

**ప్రజాశక్తి - చిలమత్తూరు**

వైసీపీ క్యాంపు కార్యాలయంలో మాజీ సీఎం జగన్ ని వైసీపీ సీనియర్ శెట్టి పల్లి ఎంపీటీసీ జగన్ మోహన్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలోని పలు సమస్యలు జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్ రెడ్డి, జయరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మడకశిర :** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని నియోజకవర్గ వైసిపి నాయకులు బుధవారం తాడేపల్లిలో కలిశారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈరలక్కప్ప, మాజీ మంత్రి నర్సి గౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటి ప్రభాకర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి శివకుమార్, మున్సిపల్ చైర్మన్ లక్ష్మి నరసమ్మ, జయరాజు, న్యాయవాది నరసింహమూర్తి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు హరే సముద్రం మూర్తి, జడ్పిటిసి భూతరాజు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, కన్వీనర్ త్రిలోక్, రామిరెడ్డి, మహేంద్ర తదితరులు జగన్‌ను కలిసి నియోజకవర్గ సమస్యలు వివరించారు.